క్లుప్తంగా

శ్రీవారికి ప్రత్యేక పూజలు



రథంపై కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

పాలసముద్రం: తిరుమల బ్రహ్మోత్సవానికి తమిళనాడు ఆరణి నుంచి పాదయాత్రగా భక్తులు రథంపై తీసుకొస్తున్న శ్రీవెంకటేశ్వర స్వామి, అమ్మవార్లకు బలిజకండ్రిగలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. నడిచి వస్తున్న భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు.

పేదలకు వస్త్రదానం



వస్త్రదానం చేస్తున్న దాతలు

నగరి: ఓంశక్తి ఆలయంలో దసరా ఉత్సవాలను పురస్కరించుకొని అన్నదానం, వస్త్రదానం ఘనంగా నిర్వహించారు. ఆదివారం పలువురు పేదలకు చీరలు, పంచెలు పంపిణీ చేయడంతోపాటు వారికి అన్నదానం చేశారు. ఈ కార్యక్రమానికి దాతలుగా సరోజమ్మ, హరినాయుడు, రవిబాబు, బాబు, రమేష్, డాక్టర్ మంజుల, కన్నప్ప తదితరులు వ్యవహరించారు. ఆలయ నిర్వాహకులు దాతలకు ఆలయ మర్యాదలు చేసి, ప్రసాదాలు అందజేశారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

చిత్తూరు కార్పొరేషన్: అక్రమంగా వసూలు చేస్తున్న విద్యుత్ చార్జీలను తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు డిమాండ్ చేశారు. కరెంటు బిల్లులు తగ్గించాలంటూ ఆదివారం ఆ పార్టీ కార్యాలయంలో పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ తుది నిర్ణయం ప్రకారం రు.923 కోట్లు మాత్రమే కాకుండా సంవత్సర కాలంలో ట్రూఅప్ చార్జీలు రూ.2,758 కోట్లు వినియోగదారులకు వాపసు చేయాలన్నారు. పలు రకాలుగా వినియోగదారుల నుంచి వసూలు చేసిన మొత్తాన్ని తిరిగి చెల్లించాలన్నారు. విద్యుత్ అదనపు భారం మోపబోమని ఎన్నికల సమయంలో ప్రకటించిన నారా చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక బాదుడే..బాదుడు మొదలు పెట్టారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్ర, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు వేగవంతంపై దృష్టి

గుడిపాల: పంటలు సాగు చేసిన రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి సంగీత కోరారు.ఈ-పంట నమోదుపై ఆదివారం మండలంలోని వెప్పాలమానుచేను, పాపసముద్రం గ్రామాల్లో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, మండలంలో మామిడిపంట అధికంగా ఉండడంతో పాటు జ్యూస్ ఫ్యాక్టరీలు కూడా ఎక్కువగా ఉన్నాయన్నారు. వ్యవసాయ సిబ్బందికి అక్కడ డ్యూటీలు వేయడం వల్ల ఈ-పంట నమోదులో కొంత జాప్యమైందన్నారు. ఈ తరుణంలో ఈ-పంట నమోదును వేగవంతం చేయడంపై దృష్టి సారించాలని, రైతులు తాము సాగు చేసిన పంటలను చూపించి ఈ-పంటను నమోదు చేసుకోవాలన్నారు. మండలం కొంత వెనకబడి ఉండడంతో ఆదివారం సెలవురోజైననూ పనిచేస్తున్నామన్నారు. ఇప్పటికే 5వేల సర్వే నంబర్లు ఈ-పంట నమోదైందని, ఇంకా చేయాల్సి ఉందని ఆమె తెలిపారు.

రవాణా నిర్వీర్యం



స్కూల్ బస్సు ఫిట్‌నెస్ తనిఖీ చేస్తున్న అధికారులు (ఫైల్)

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రైవేటీకరణకు అత్యంత మొగ్గు చూపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రైవేటీకరణపై ఎక్కువ మక్కువ చూపుతూ విశాఖ ఉక్కును ప్రైవేటీకరణ చేయడాన్ని కార్మికులు అడ్డుకొని పోరాటాలు చేస్తున్నారు. పీపీపీ అంటూ మెడికల్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం ప్రైవేటుకు అప్పగించేందుకు ఉత్తర్వులు జారీచేసిన విషయం విదితమే. ఇలా పలు ప్రభుత్వ వ్యవహారాలు ప్రైవేటుపరం అవుతున్నాయి. ఇందులో రవాణాశాఖ ఆధీనంలోని పలు వ్యవహారాలు ఒకటి తరువాత ఒకటి ప్రైవేటుపరం అవుతూ నిర్వీర్యమైపోతోంది. –నగరి

- రవాణా శాఖపై ప్రైవేటు పెత్తనం
- వాహనాల ఫిట్‌నెస్ కూడా ప్రైవేటుపరం
- ఆటోమేటెడ్‌గా వాహనాల పరీక్షలు
- ఇప్పటికే రిజిస్ట్రేషన్, నేమ్ ట్రాన్స్‌ఫర్ ప్రైవేటుకు అప్పగింత
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొనసాగిస్తున్న ప్రైవేటీకరణ పరంపర



నగరిలోని ఎంవీఐ కార్యాలయం

ప్రస్తుతం సరుకులు రవాణా చేసే వాహనాల ఫిట్‌నెస్ బాధ్యతను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించనున్నారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో అధికారులు ఇప్పటికే టెండర్లు కూడా ఆహ్వానించారు. ప్రైవేటు వారు కేంద్రాన్ని త్వరలో ఏర్పాటు చేయనున్నారు. అక్కడ పూర్తి సాంకేతిక పద్ధతులలో వాహనాల ఫిట్‌నెస్ చూడనున్నారు. ఇక నుంచి వాహనదారులు రవాణా శాఖ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇప్పటికే రాష్ట్రంలో తిరుపతి మినహా అన్ని జిల్లాల్లో ఇలాంటి ఫిట్‌నెస్ పరీక్షల సెంటర్లను ప్రారంభించారు. ఈ ఫిట్‌నెస్ సెంటర్లు ఇదివరలో ఉన్న మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో ఉండేవి. అయితే ప్రస్తుతం అత్యంత దూరంలో ఏర్పాటు చేస్తుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు లోనుకాక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి.

ఏడాదికి ఒకసారి తప్పనిసరి

జిల్లాలో ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి వివిధ రకాల వాహనాలు సుమారు 30 వేల వాహనాలు, నాన్ ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి వివిధ రకాల వాహనాలు సుమారు 3.5 లక్షలు ఉన్నాయి. వీటికి బ్రేక్, ఫిట్‌నెస్ విషయాలను ప్రైవేటు ఏజెన్సీలు చూస్తాయి. సరుకు రవాణా చేసే ఆటోలు, లారీలు, కమర్షియల్ ట్రాక్టర్లు, పాఠశాల బస్సులు, ప్రైవేటు బస్సులు తదితర వాహనాలు అన్నీ ఏడాదికి ఒకసారి ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని సర్టిఫికెట్లు పొందాల్సి ఉంది. అయితే ఈ ప్రైవేటు ఏజెన్సీలపై పర్యవేక్షణ రవాణా శాఖకు ఉండాలని సంబంధిత అధికారులు తమ యూనియన్ల ద్వారా డిమాండ్ చేస్తున్నారు. సాంకేతిక పద్ధతుల ద్వారా ఫిట్‌నెస్‌లు సక్రమంగా జరగవు అనే వాదన వారు చేస్తున్నారు. రవాణా శాఖ ఆధీనంలో ఎల్ఎల్ఆర్, డ్రైవింగ్ లైసెన్సులు ఇచ్చే ప్రక్రియ మాత్రమే ఉందని, అది కూడా ప్రైవేటుపరం చేసేస్తే రవాణాశాఖ పూర్తిస్థాయిలో నిర్వీర్యమైపోతుందని అంటున్నారు.

సాంకేతిక పద్ధతులతో ఫిట్‌నెస్ టెస్ట్

ఫిట్‌నెస్ టెస్ట్ చేయాల్సిన వాహనాలను ప్రైవేటు ఏజెన్సీలు నూతన సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఏర్పాటు చేసిన స్కానర్ల మధ్య ఉంచుతారు. పూర్తిగా స్కాన్ చేసిన తరువాత వాహనానికి ఎక్కడ సమస్యలు ఉన్నా కంప్యూటర్‌లో తెలిసిపోతుంది. వాహనాలకు ఎలాంటి మరమ్మతులు ఉన్నా సాంకేతిక పద్ధతిలో గుర్తించి, ఫిట్‌నెస్ ఉంటేనే సర్టిఫికెట్లు ఇస్తారు. ఎలాంటి చిన్న లోపాలు ఉన్నా అనుమతి లభించదు. 9 రకాల పరీక్షలతో వాహనంలోని ఇంజిన్, బ్రేకులు, స్టీరింగ్, లైట్లు, వేగం, కాలుష్య కారకాల విడుదల, హారన్ ఇలా అన్నింటినీ అన్ని కోణాల్లో తనిఖీ చేసి ఫిట్‌నెస్ ధ్రువీకరిస్తారు. వాహనంలో ఏ భాగం ఎప్పుడు మార్చుకోవాలో తెలుస్తుంది. ఇంజిన్‌లో లోపాలు తెలుస్తాయి. వాటికి మరమ్మతులు చేయించుకుంటేనే వాహనం ఫిట్‌నెస్ సర్టిఫికెటు వస్తుంది. 20 నిమిషాల్లోనే ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అందిస్తారు. అయితే ప్రైవేటు ఏజెన్సీలు ఫిట్‌నెస్ చేయడంలో అవకతవకలకు అత్యధిక శాతం అవకాశం ఉంది. దీంతో వాహనాల ఫిట్‌నెస్‌ను ప్రైవేటుకు అప్పగించడంపై రవాణాశాఖ అధికారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల బస్సులకు అనుమతులు ఇచ్చేసయంలో ప్రైవేటులో ఏవైనా అవకతవకలు జరిగితే పెనుప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ హెచ్చరిస్తున్నారు. సాంకేతికతను వినియోగించి స్కానింగ్ ద్వారా వాహన ఫిట్‌నెస్‌ను నిర్ణయించే ప్రక్రియను రవాణా శాఖ ఆధ్వర్యంలోనే నిర్వహించాలని అప్పుడే ఎలాంటి అవకతవకలకు తావుండదని అంటున్నారు.

జిల్లాలోని రవాణా వాహనాలు

జిల్లాలో వివిధ రకాల వాహనాలు 3.70 లక్షలు దాకా ఉన్నాయి. వీటిలో రవాణా వాహనాలు సుమారు రూ.30 వేలు ఉన్నాయి. వీటిలో ఆటోల సంఖ్య 6 వేలకుపైగా ఉంది. సరుకు రవాణా చేసే ఆటోలు 3,000, కమర్షియల్ ట్రాక్టర్లు 3,400, హెవీ, మీడియం వాహనాలు 6000, స్కూలు, కాలేజి బస్సులు 1105, ప్రైవేటు బస్సులు 980 ఉన్నాయి. ఇంకా అంబులెన్స్‌లు, మోటార్‌క్యాబ్‌లు 900, మ్యాక్సీలు 250 తదితర వాహనాలు ఉన్నాయి. ఇవి కాక మోటార్ సైకిళ్లు 2,90,767, మోటారుకార్లు 23,541, వ్యవసాయ ట్రాక్టర్లు 23,776 మిగిలినవి ఇతర వాహనాలు తిరుగుతున్నాయి.

130 కిలోమీటర్లు వెళ్లాలి



నగరిలోనే మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం ఉంది. ఈ కార్యాలయ పరిధిలోని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు బంగారుపాళెం ఆటోమేటెడ్ టెస్టింగ్ సెంటర్‌కు వెళ్లాలని అంటున్నారు. విజయపురం నుంచి బంగారుపాళెంకు 130 కిలోమీటర్లు వెళ్లాలి. కార్యాలయ పరిధిలో ప్రభుత్వమే ఫిట్‌నెస్ సెంటర్ నిర్వహించేలా ఉంటే అందరికీ ఉపయోగపడేది. ప్రభుత్వం అన్నింటినీ ప్రైవేటు పరం చేస్తోంది. నగరిలో పొందే ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు నేడు బంగారుపాళెంకు వెళ్లాల్సి ఉంది.

–రాజాదాస్, వాహనదారుడు, విజయపురం

ఆక్రమణలను అడ్డుకోండి



మాట్లాడుతున్న గ్రామస్తులు

శ్రీరంగరాజపురం: అధికార బలంతో కూటమి నాయకులు ఏదీ కూడా వదలడం లేదు. వారి భూకబ్జా దాహానికి పచ్చని గుట్టలు వారి వశం కావాల్సిందే. స్థానికుల కథనం మేరకు మండలంలో వెంకటాపురం రెవెన్యూ పరిధిలోని బావిమూల గుట్టలో పశువుల మేత భూమి ఉంది. ఈ భూమిపై కూటమి నాయకుల కన్ను పడింది. అధికారం బలంతో ఈ గుట్టలోని కొంత కబ్జా చేసేశారు. ఈ భూమిని నమ్ముకొని చుట్టు పక్కల గ్రామాలవారు పశువులు, గొర్రెలు, మేకలను పెంచుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గుట్టకు వెళ్లడానికి ఉన్నా రహదారినిసైతం వదలకుండా జేసీబీ సహాయంతో తవ్వేశారని గ్రామస్తులు తెలిపారు. పశువుల మేత భూమి కూడా కబ్జాకు గురైతే పశువులు ఎక్కడ మేపుకోవాలో తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు స్పందించి భూకబ్జాదారుల నుంచి భూమిని విడిపించి, పెంపుడు జంతువులను మేపేందుకు రహదారి సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు.

జీఎస్టీపై అవగాహన

బంగారుపాళెం: నిత్యావసర వస్తువులపై ప్రభుత్వం తగ్గించిన జీఎస్టీ గురించి దుకాణ యజమానులు, వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్నట్టు జిల్లా అధికారి సురేంద్రబాబు తెలిపారు. ఆదివారం బంగారుపాళెంలో పలు దుకాణాలకు వస్తువులపై తగ్గిన జీఎస్టీ పన్ను కరపత్రాలను అందజేశారు. తగ్గిన జీఎస్టీ ప్రకారం విక్రయాలు చేయాలని, జీఎస్టీ తగ్గినా వస్తువులను ఎక్కువ ధరలకు విక్రయించినట్లు ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నిబంధనల మేరకు దుకాణాలలో వినియోగదారులకు నాణ్యమైన వస్తువులను విక్రయించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సేల్స్ టాక్స్ అధికారి వివేక్, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



నవనీతమ్మ పార్థివ దేహానికి నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: అధ్యాపకుడు బండి ఉమాపతిరెడ్డి తల్లి నవనీతమ్మ ఆదివారం ఉదయం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ సీపీ అడ్వయిజరీ కమిటీ సభ్యుడు నారాయణస్వామి గ్రామానికి చేరుకుని నవనీతమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి యోగక్షేమాలపై వాకబు చేశారు. ఆయన వెంట జెడ్పీటీసీ మాజీ సభ్యుడు గోవర్ధన్‌రెడ్డి, ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాష్, కో–ఆప్షన్ సభ్యుడు వెంకటేష్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు చిరంజీవిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు రమేష్‌రెడ్డి, పెద్దిరెడ్డి, యువత మాజీ మండల అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షుడు జగదీశ్ రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, పురంధర్‌రెడ్డి ఉన్నారు.

వైఎస్ఆర్ సీపీ నాయకుడికి ఘన నివాళి

కార్వేటినగరం: మండల పరిధిలోని కత్తెరపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు, విశ్రాంత ఆర్టీసీ కండక్టర్ ముత్తయ్య(72) అనారోగ్యంతో మృతి చెందాడు. దీనిపై సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి ముత్తయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ ముత్తయ్య మరణం జీర్ణించుకోలేకపోతున్నామని అన్నారు. వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, సోషల్ మీడియా మండల అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి, సీనియర్ నాయకులు శోభన్‌బాబు, అర్జునయ్య, మురగయ్య తదితరులు ఉన్నారు.

గుర్రం జాషువా పురస్కారం ప్రదానం



హరికృష్ణను సన్మానిస్తున్న అతిథులు

పెనుమూరు(కార్వేటినగరం): ప్రముఖ కవి, రచయిత, అభ్యుదయ రైతు పసపల హరికృష్ణారెడ్డికి గుర్రం జాషువా స్మారక పురస్కారం లభించింది. ఆదివారం మురకంబట్టు వినాయక దేవాలయ కళా ప్రాంగణంలో గుర్రం జాషువా జయంతి సందర్భంగా ఆదివారం ఆయన పురస్కారం అందుకున్నారు. బీజేపీ నాయకుడు చిట్టిబాబు నాయుడు, దుర్గారామకృష్ణ, విశ్రాంత డీఈఓ చిట్టిబాబు తదితరులు మాట్లాడుతూ గత నాలుగు దశాబ్దాలుగా తెలుగు భాషా సాహిత్యానికి హరికృష్ణారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి గుర్రం జాషువా పురస్కారాన్ని అందించామన్నారు. చిత్తూరు జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ తెలుగు రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా, గురజాడ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శిగా తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారని కొనియాడారు.

కాశీబుగ్గ ఆలయ దొనల్లో నీటి ప్రవాహం





దొనల్లో ప్రవహిస్తున్న నీరు

నగరి: మండలంలోని బుగ్గ అన్నపూర్ణసమేత శ్రీకాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని దొనల్లో నీరు ప్రవహిస్తోంది. వర్షాలు లేక కొంత కాలం దొనల్లో వచ్చే నీరు ఆగిపోయింది. దీంతో ఆలయానికి వచ్చినా చారిత్రక విశిష్టత కలిగిన దొనలను దర్శించడానికి భక్తులు వెళ్లే వారు కాదు. ఆలయ చరిత్ర మేరకు వనవాసం సమయంలో పాండవులు కాశీని పోలిన విధంగా ఆలయంలో దేవతల అమరిక ఉండడాన్ని, ఆలయంలో గంగాజలం లేకపోవడాన్ని గమనించి కాశి, గుహ, భవాని, మణికర్ణిక, యమున అనే ఐదు దొనలను సృష్టించినట్లు ఆలయపురాణం. నీరు ఎక్కడి నుంచి వస్తుందో తెలియని రీతిలో ఇక్కడి దొనల్లో నిత్యం నీటి ప్రవాహం ఉండేది. కాలక్రమేణా పరిసర ప్రాంతాల్లో వచ్చిన మార్పులు, వర్షాలు లేకపోవడంతో నీటిప్రవాహం ఆగింది. ఎక్కువగా వర్షాలు పడే సమయంలో మాత్రమే మూడు లేక రెండు దొనల్లో నీటి ప్రవాహం ఉండేది. ప్రస్తుత వర్షాలకు రెండు దొనల్లో నీరు ప్రవహిస్తుండడంతో వాటిని చూడడానికి భక్తులు ఆసక్తి చూపుతున్నారు. స్థానికులు, ఆలయానికి విచ్చేసే భక్తులు, అయ్యప్ప దీక్ష మాలధారణ భక్తుల దొనల్లో వచ్చే నీటిలో స్నానమాచరించి శ్రీకాశీవిశ్వేశ్వరుని దర్శించుకుంటున్నారు.

ముమ్మరంగా వరి సాగు ఏర్పాట్లు



పాలసముద్రంలో వరినాట్లు



పొలాన్ని చదును చేస్తూ వరినారు వేస్తున్న రైతు

పాలసముద్రం: వరి సాగుకు రైతులు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. శని, ఆదివారాల్లో రెండో విడత దుక్కులు చేసి వరి పంట వేస్తున్నారు. మండలంలో బోరుబావుల కింద ఉన్న రైతులు సుమారు 765 హెక్టార్ల భూమిలో వరి పంటలు, మరి కొంత మంది రైతులు 346 హెక్టార్లు వేరుశనగ సాగు చేస్తున్నారు. రైతులు ఏ పంట సాగు చేసిన ఎక్కువగా రసాయన ఎరువులు, పురుగు మందులను వాడడంతో భూములు మొద్దుబారిపోయి దిగుబడి తగ్గిపోతుందన్నారు. ఈ నేపథ్యంలో స్థానికంగా లభించే ఆకులతో జీవామృతం, ఘనజీవామృతం తయారు చేసుకుని పంటలకు ఉపయోగిస్తే అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు చాలా వరకు వ్యవసాయాధికారి సూచనలు పాటిస్తున్నారు.

మాజీ మంత్రి రోజాను కలసిన నాయకులు



మాజీ మంత్రి ఆర్కే రోజాతో నింద్ర నాయకులు

నింద్ర: మండలంలోని అగరంపేట గ్రామానికి చెందిన సెల్వరాజ్ వైఎస్ఆర్ సీపీ పంచాయతీ రాజ్ జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబరుగా నియమతులయ్యారు. అదే విధంగా ఇరుగవాయి గ్రామానికి చెందిన లక్ష్మీపతి వైఎస్ఆర్ సీపీ జిల్లా ఐటీ విభాగం జనరల్ కార్యదర్శిగా నియమలైన సందర్భంగా ఆదివారం నగరిలో మాజీ మంత్రి ఆర్కే రోజాను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ పదవులను ఇవ్వడంపై మాజీ మంత్రికి తోడుగా ఉండి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి ఆర్కే రోజాను వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దీప, వైస్ ఎంపీపీ శుభా, రాష్ట్ర నాయకులు శ్యామ్‌లాల్, జెడ్పీటీసీ పరంధామ, వేణురాజు, రాజేష్, విజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నవరాత్రులు






పుత్తూరు: ఆరేటమ్మ, నింద్రలో మహా చండి









మహాలక్ష్మిగా అమ్మవారు, పుత్తూరు: కామాక్షీదేవిగా ద్రౌపదీదేవి, కామాక్షీదేవి, లక్ష్మీదేవిగా అల్లియల్లమ్మ తల్లి



వెదురుకుప్పం: మహాచండీగా రాజరాజేశ్వరి అమ్మవారు

పుత్తూరు: నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని ఆరేటమ్మ, ద్రౌపదమ్మ, కామాక్షమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాల్లోని అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి, భక్తులు దర్శనభాగ్యం కల్పించారు. కామాక్షీదేవిని కామాక్షిగా, ఆరేటమ్మ లక్ష్మీదేవిగా, ద్రౌపదీదేవిని కామాక్షీదేవిగా భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం పురవీధుల్లో అమ్మవార్ల ఊరేగింపు నిర్వహించారు.

శ్రీమహాలక్ష్మి అలంకరణ

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన శ్రీఆరిమాని గంగమ్మ దసరా నవరాత్రులు ఉత్సవంలో భాగంగా ఆరో రోజు ఘనంగా నిర్వహించారు. అర్చకులు వేకువ జామున అర్చనలు, అభిషేకాలు చేశారు. ఉదయం శ్రీమహాలక్ష్మి దేవి కాలార్చన హారతి, శ్రీమహాలక్ష్మి గణపతి హోమం, శ్రీ మహాలక్ష్మి దేవి షోడశపూజ, మహా మంగళ హారతి హోమం నిర్వహించారు. ఆలయ అర్చకులు, అధికారులు భక్తులకు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేసి, తీర్థప్రసాదాలను అందించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. హరికథ కాలక్షేపం ఏర్పాటు చేశారు. సాయంత్రం అమ్మవారిని ఊరేగించారు. ఉభయదారులుగా ఆళ్లమడుగు గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ బి.నవ్యశ్రీ కుటుంబ సభ్యులు, సిద్ధిష్‌రెడ్డి వ్యవహరించారు.

లక్ష్మీదేవిగా అల్లియల్లమ్మ

గంగాధరనెల్లూరు: మండల కేంద్రంలో కొలువైన అల్లియల్లమ్మ తల్లి దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా ఆరవరోజు లక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి మూల, ఉత్సవమూర్తులకు ఆలయంలో గాజులతో ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, సాయత్రం ఆలయ మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జంగాలపల్లి గ్రామానికి చెందిన కుమార్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. గంగాధరనెల్లూరు ఎగవూరుకు చెందిన వేణు కుమారుడు మధుమహేష్ (పంబల్) కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మహాచండిగా రాజరాజేశ్వరి

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగ గ్రామ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో జరుగుతున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మహాచండీ దేవి అవతారంలో రాజరాజేశ్వరి దేవి భక్తులను కటాక్షించారు. ఈ సందర్భంగా వేకువజామునే సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొలిపి దూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకులు అమ్మవారికి భక్తిప్రపత్తులతో అభిషేకాలు చేశారు. వెండితొడుగులతో కూడిన పట్టు పీతాంబరాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

మహాచండిగా మహాలక్ష్మి

నింద్ర: మండలంలో ఆదివారం వివిధ గ్రామాల్లో జరుగుతున్న దేవీ నవరాత్రుల సందర్భంగా ఆదివారం మహచండీ అవతారంలో దర్శనమిచ్చారు. మండల కేంద్రంలోని వినాయక ఆలయంలో జరుగుతున్న దేవీ నవరాత్రుల మహోత్సవం ప్రత్యేకపూజలు నిర్వహించారు. కేఆర్‌పాళెం గ్రామంలో మహాలక్ష్మి అమ్మవారి దేవాలయంలో పూజలు చేశారు.

టౌన్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి

చిత్తూరు అర్బన్: చిత్తూరు కో–ఆపరేటివ్ టౌన్ బ్యాంకు పురోభివృద్ధికి కృషి చేయనున్నట్లు బ్యాంకు చైర్మన్ రమేష్ నాయుడు అన్నారు. స్థానిక గిరింపేటలోని టౌన్ బ్యాంకుశాఖలో ఆదివారం బ్యాంకు సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, వందేళ్ల చరిత్ర కలిగిన టౌన్ బ్యాంకుకు జవసత్వాలు తీసుకురావడానికి ప్రణాళికబద్ధమైన చర్యలు చేపట్టామన్నారు. ఖాతాదారుల సంక్షేమమే ధ్యేయంగా నూతన పథకాలను అమలు చేస్తామన్నారు. అనంతరం ఖాతాదారుల సలహాలు–సూచనలు స్వీకరించారు. బ్యాంకు సిబ్బందికి జీతభత్యాల పెంచాలని తీర్మానం చేశారు. సమావేశంలో బ్యాంకు పాలకవర్గ సభ్యులు సురేష్, అన్వర్ బాషా, అకౌంట్స్ అధికారి సుమతి తదితరులు పాల్గొన్నారు.